# ఆలయంలో ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 21 : హవేళీఘనపూర్ మండలం వాడి గ్రామంలోని సిద్ధిరామేశ్వరస్వామి ఆలయ అష్టమ వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆలయంలో గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, మంటపారాధన, అఖండ దీప స్థాపన, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు యామిరెడ్డి, సాయాగౌడ్, మహిపాల్‌రెడ్డి, ఎం పీటీసీ సిద్ధిరెడ్డి పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కలిసిన నాయకులు

చేగుంట, ఫిబ్రవరి 21 : దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని చేగుంట మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా కోమండ్ల నారాయణరెడ్డి స్థానిక నాయకులతో కలిసి బుధవారం దుబ్బాక ఎమ్మెల్యేను హైదరాబాద్‌లో కలిశారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో నాయకులు రంగాయ్యగారి రాజిరెడ్డి, సుభాష్‌రెడ్డి, దొమ్మాట మోహన్‌రావు ఉన్నారు.

# బస్సుల కొరత.. ప్రయాణికులకు ఇక్కట్లు



రామాయంపేట ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

రామాయంపేట, ఫిబ్రవరి 21 : మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర నేపథ్యంలో గ్రామాల్లోకి వచ్చే ఆర్టీసీ బస్సుల సంఖ్య తగ్గింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరిపడా బస్సులు రాకపోవడంతో ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఫలితంగా బస్సుల్లో నిలబడడానికి సైతం స్థలం ఉండడం లేదు. బుధవారం రామాయంపేట బస్టాండ్‌లో బస్సు ఎక్కడానికి ప్రయాణికులు కుస్తీ పడుతున్నారు. మేడారం జాతర సందర్భంగా బస్సులన్నీ సమ్మక్క– సారలక్క జాతరకు వెళ్తున్నాయి. బస్సుల సంఖ్య తగ్గడంతో ప్రయాణికుల అవస్థలు పెరిగాయి. జాతర కారణంగా రామాయంపేట డిపోలో మెదక్, కామారెడ్డి, మేడ్చల్, సికింద్రాబాద్ డిపోలకు చెందిన బస్సుల సంఖ్య భారీగా తగ్గాయి.

# మనోవికాసానికి సాహిత్యం మూలం



మాట్లాడుతున్న బాల సాహిత్య పరిశోధకుడు డాక్టర్ రాజేశ్వర్‌శర్మ

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 21 : విద్యార్థుల మనోవికాసానికి కథలు ఎంతో దోహదం చేస్తాయని బాల సాహిత్య పరిశోధకుడు డాక్టర్ రాజేశ్వర్‌శర్మ అన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో మాతృభాష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌శర్మ మాట్లాడుతూ.. కథలు వినడం లేదా చదివితే విద్యార్థుల్లో కొత్త విషయాలు తెలుసుకోవాలని ఆసక్తి పెరుగుతుందన్నారు. పుస్తక పఠనం పెరగడంతోపాటు చక్కటి భాషా నైపుణ్యాలు అలవడుతాయని తెలిపారు. మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పద్యాలను పాడే విధానం, కవిత్వాన్ని చదివే విధానాన్ని ఉపన్యాసకుడు పవన్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుధాకర్, శరత్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, వేణుగోపాల్, సుధారాణి, అరుంధతి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



గడిపెద్దాపూర్ వద్ద ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రేణుకారెడ్డి

అల్లాదుర్గం, ఫిబ్రవరి 21 : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలతోపాటు ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సీఐ రేణుకారెడ్డి సూచించారు. రెండు రోజుల క్రితం గడిపెద్దాపూర్ వద్ద జరిగిన ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా 161వ జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనాలను నిలిపి, వాహనదారులకు జరిమానాలు విధించి, కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాన్ని నడిపితే సీజ్ చేస్తామన్నారు. రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవన్నారు. నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. సీఐ వెంట ఎస్సై ప్రవీణ్‌రెడ్డి, ఏఎస్సై దేవీదాస్‌తోపాటు సిబ్బంది ఉన్నారు.

# 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**జిల్లా విద్యాధికారి రాధాకిషన్**



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

పెద్దశంకరంపేట/ అల్లాదుర్గం, ఫిబ్రవరి 21 : పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ సూచించారు. బుధవారం పెద్దశంకరంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, బాలికల ఉన్నత పాఠశాలలను సందర్శించి, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు గణితం, సైన్స్, తెలుగు విషయాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలను తెలుసుకున్నారు. విద్యార్థులు భయం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. డీఈవో వెంట ఎం ఈవో వెంకటేశం, ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్, రాజేశ్వర్, విఠల్, ప్రసన్నకుమార్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

### వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

రేగోడ్, ఫిబ్రవరి 21 : మండల పరిధిలోని జగిర్యాల, రేగోడ్‌లోని పాఠశాలలను బుధవారం ఎంఈవో బుచ్చానాయక్ సందర్శించారు. ఆయా పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. త్వరలో వార్షిక పరీక్షలు ఉన్నాయని, విద్యార్థులు శ్రద్ధగా చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. టీవీ, సెల్‌ఫోన్ పక్కనపెట్టి విద్యపై దృష్టి సారించాలని సూచించారు. రేగోడ్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలించారు. ఎంఈవో వెంట కాంప్లెక్స్ హెచ్‌ఎం సుశీల, ఉపాధ్యాయులు ఉన్నారు.

# సమయపాలన పాటించాలి

- కలెక్టర్ రాజర్షి షా
- కొడిపల్లి ప్రభుత్వ దవాఖానలో తనిఖీ



కొడిపల్లి ప్రభుత్వ దవాఖానలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కొడిపల్లి, ఫిబ్రవరి 21 : వైద్యసిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు వైద్యసేవలు అందించాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. కొడిపల్లి మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ రాజర్షిషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులతోపాటు ఫార్మసీ, ల్యాబ్‌లను పరిశీలించారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన వారిపై అగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. జిల్లాలో ప్రసవాలు అధికంగా జరిగే రెండో దవాఖానగా కొడిపల్లి ప్రభుత్వ దవాఖానకు గుర్తింపు ఉందన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణకు ఏడుగురు స్టాఫ్ నర్సులను కొడిపల్లి దవాఖానకు కేటాయించినట్లు తెలిపారు. తనిఖీ చేసే సమయంలో దవాఖానలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంపై అగ్రహం వ్యక్తం చేశారు. విధులకు హాజరుకాని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి పక్కన కొడిపల్లి దవాఖానకు గ్రామీణ ప్రజలు అధికంగా వస్తారని, సిబ్బంది సమయపాలన పాటిస్తూ వైద్యసేవలు అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయనిర్మల, హెచ్‌ఈ మంగ, హెచ్‌ఈవో సురేందర్, సీహెచ్‌వో ఎలిజబెత్ రాణి, కొడిపల్లి దవాఖాన వైద్యుడు ప్రవీణ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ రమేశ్ తదితరులు ఉన్నారు.

# 'ఉపాధి'పై సామాజిక తనిఖీ

తూప్రాన్, ఫిబ్రవరి 21 : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని బుధవారం తూప్రాన్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. సామాజిక తనిఖీకి అడిషనల్ డీఆర్డీవో విరోజ హాజరయ్యారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి మండలంలో చేపట్టిన ఉపాధిహామీ పనులకు రూ. రూ.4,08,14,874 ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కార్యదర్శులు, టీఏ, ఎఫ్‌ఏలకు రూ. 7వేల జరిమానా విధించారు. రూ. 1,19,408లను రికవరీ చేశారు. సామాజిక తనిఖీలో ఎంపీపీ స్వప్న, అంబుడ్స్‌మన్ ప్రభాకర్, హెచ్‌ఆర్ రాజేందర్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీవో సంతోష్‌రెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# ఎరువుల కొరత రావొద్దు

**జిల్లా వ్యవసాయాధికారి గోవిందు**



తూప్రాన్‌లోని ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గోవిందు

తూప్రాన్, ఫిబ్రవరి 21 : జిల్లాలో రైతులకు ఎరువుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని ఫర్టిలైజర్ యజమానులు, డీలర్లకు జిల్లా వ్యవసాయాధికారి గోవిందు అన్నారు. బుధవారం తూప్రాన్ పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఏవో గంగమల్లుతో కలిసి తనిఖీ చేశారు. యూరి యా, డీఏపీ, కాంప్లెక్స్, ఎస్‌ఎస్‌పీ ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈపాస్ మిషన్ ద్వారానే ఎరువులను విక్రయిం చాలని సూ చించారు. పీఎం కిసాన్ కోసం ఈ–కేవైసీ చేసుకోవాలని ,వ్యవసాయాధికారుల సూచనలను పాటిస్తూ పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలనిసూచించారు.

# స్నేహితులే.. దొంగలు

- రూ. 5లక్షల నగదు, రెండు బైక్‌లు స్వాధీనం
- ఇద్దరు నిందితుల అరెస్టు.. రిమాండ్
- రామాయంపేట సీఐ వెంకటేశ్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రామాయంపేట, ఫిబ్రవరి 21 : స్నేహితులే దొంగలు మారి.. నమ్మినవాడిని నట్టేట ముంచారు. ఒక దొంగతనం కేసులో పోలీసులు దర్యాప్తు చేయగా స్నేహితులే దొంగలు అన్న నిజం బయటకు వచ్చింది. చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. రామాయంపేట పట్టణంలోని మంజీరా కాలనీకి చెందిన గంధం చంద్రయ్య ఇంట్లో మంగళవారం రాత్రి రూ.5లక్షల నగదును చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు. చంద్రయ్య దగ్గరి స్నేహితులే దొంగతనం చేసినట్లు నిర్ధారించారు. మన్నె శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి ఇద్దరు కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామానికి చెందినవారు. జీవనోపాధి నిమిత్తం రామాయంపేటలో నివాసం ఉంటూ చంద్రయ్యకు స్నేహితులుగా మారారు. చంద్రయ్య రెండు రోజుల క్రితం బోనాల కొండాపూర్ గ్రామంలోని భూమిని విక్రయించాడు. స్నేహితులైన శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి సమక్షంలోనే భూమిని విక్రయించగా వచ్చి, రూ. 5 లక్షల నగదను తన ఇంట్లోని బీరువాలో పెట్టాడు. కండ్ల ముందు నగదు కనిపించడంలో స్నేహితుల బుద్ధి వక్ర మార్గం పట్టింది. భార్య కిడ్నీ చికిత్స కోసం చంద్రయ్య కామారెడ్డికి వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కరు చంద్రయ్యకు తోడుగా ఉండడానికి వెళ్లగా, మరొకరు ఇంటివద్దే ఉండి రూ.5లక్షలు చోరీ చేశాడు. చంద్రయ్య ద్వారా పూర్తి వివరాలను సేకరించిన పోలీసులు విచారణ చేపట్టి, స్నేహితులే దొంగతనానికి పాల్పడ్డట్లు తెలిపారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని రూ.5లక్షల నగదుతోపాటు రెండు బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్, ఎస్సై రంజిత్ వివరించారు.

## మెదక్ డీఎస్పీ ఫణీంద్ర బదిలీ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 21 : మెదక్ డీఎస్పీ సీహెచ్‌ఆర్‌వీ ఫణీందర్‌ను రాష్ట్ర ప్రభుత్వం సైబర్ సెక్యూరిటీకి బదిలీ చేసింది. అక్కడ విధులు నిర్వహిస్తున్న రాజేశ్వర్ మెదక్ డీఎస్పీగా బదిలీపై రానున్నారు.

## చేగుంటలో మాతృభాష దినోత్సవం



మాట్లాడుతున్న హెచ్‌ఎం నీరజ

చేగుంట, ఫిబ్రవరి 21 : చేగుంటలోని జిల్లాపరిషత్ పాఠశాలలో మాతృభాష దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం నీరజ మాతృభాష ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలిత, రాధ, సరస్వతి, శ్రీవాణి, శారద, వెంకటేశ్, రాథోడ్, రఘుపతి, రాజేశ్వర్, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

## సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పెద్దశంకరంపేట/ అల్లాదుర్గం, ఫిబ్రవరి 21 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి అర్చక సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. అర్చకులకు వేతనాలు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం మాణిక్య ప్రభు దేవాలయంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అర్చకుల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడంపై అర్చకులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్చక సంఘం ఉపాధ్యక్షుడు గుడి చంద్రశేఖర్ శర్మ, అర్చకులు మహేశ్‌శర్మ, కృష్ణ శర్మ, సంగమేశ్వర్‌శర్మ, గిరిధర్‌కుమార్, వేణు, సంతోష్‌శర్మ, రామాచారి, దత్తాత్రేయ స్వామి తదితరులు ఉన్నారు.

## రామాయంపేటలో ఆధార్ కేంద్రం

రామాయంపేట, ఫిబ్రవరి 21 : రామాయంపేట పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం సమీపంలో మీసేవ కేంద్రంలో ఆధార్ సేవలు అందిస్తున్నట్లు ఆపరేటర్ అమర్ తెలిపారు. ఆధార్ సెంటర్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎట్టకేలకు రామాయంపేటలో ఆధార్ సేవలు ప్రారంభం కావడంతో పట్టణ, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 24 నుంచి టెక్నికల్ 'సర్టిఫికెట్' పరీక్షలు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 21 : టెక్నికల్ కోర్స్ (టైలరింగ్, డ్రాయింగ్) పరీక్ష కొరకు ఫీజు చెల్లించిన అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను http//bse// telangana. gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 24 నుంచి 27 వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటలు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో రాధాకిషన్ వివరించారు.

# కేసులు పరిష్కరించుకోవాలి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద**



సమావేశంలో మాట్లాడుతూన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 21 : కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద సూచించారు. జిల్లా న్యాయస్థానాల సముదాయంలో ఇన్సూరెన్స్ స్టాండింగ్ కౌన్సిల్స్, చిట్‌ఫండ్ కౌన్సిల్స్, న్యాయవాదులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. మార్చి నెలలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించాలని న్యాయవాదులకు సూచించారు. పెండింగ్ కేసులను లోక్ అదాలత్‌లో రాజీ పడేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. మోటార్ వెహికల్ ఆక్సిడెంట్ కేసులు, ఎన్‌ఐ యాక్ట్ కేసులు, సివిల్ కేసులు, క్రిమినల్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని కక్షిదారులకు సూచించారు. సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి రీటాలాల్‌చంద్, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కమ్ స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ కల్పన పాల్గొన్నారు.

# ఉపకార వేతనాలు విడుదల చేయాలి

**కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ నాయకుల ధర్నా**



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 21 : ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శశికాంత్ డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను విడుదల చేయాలని బుధవారం కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ నాయకులు ధర్నా నిర్వహించి, ఆదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శశికాంత్ మాట్లాడుతూ.. ఉపకార వేతనాలు భిక్ష కాదు విద్యార్థుల హక్కు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేస్తున్నదని విమర్శించారు. అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్, నాయకులు మల్లేశం, కార్తికేయ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల ఆలయానికి శివస్వాముల పాదయాత్ర



కొల్చారం : తుక్కాపూర్ నుంచి శ్రీశైలం బయటు దేరిన శివస్వాములు.

కొల్చారం, ఫిబ్రవరి 21 : మహాశివరాత్రి సందర్భంగా శివమాల ధరించిన శివస్వాములు కొల్చారం మండలం తుక్కాపూర్ నుంచి శ్రీశైలం ఆలయానికి బుధవారం పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా తుక్కాపూర్‌లోని హనుమాన్ ఆలయంలో వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, కాలినడకన శ్రీశైలం బయలుదేరారు. శివస్వాములు శ్రీశైలం, హనుమప్ప, శేఖర్, సురేశ్, నవీన్, మధుతోపాటు గ్రామానికి చెందిన 15 మంది యువకులు శ్రీశైల ఆలయానికి పాదయాత్రగా తరలివెళ్లారు.

# వేసవిలో తాగునీటి సమస్య రావొద్దు

**కార్యదర్శుల సమావేశంలో ఎంపీపీ భాగ్యలక్ష్మి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 21 : గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి సూచించారు. బుధవారం చిన్నశంకరంపేట ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. వేసవి కాలంలో తాగునీటి సమస్యల తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పైపులైన్ మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో దామోదర్, తహసీల్దార్ మనన్, ఎంపీవో గిరిధర్‌రెడ్డి, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# అనాథ పిల్లలను ఆదుకుంటాం..

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 21 : ప్రాణం ఉన్నంత వరకు ప్రజా సేవ చేస్తానని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. చిన్నశంకరంపేట మండలం చందాపూర్ గ్రామానికి చెందిన నలుగురు అనాథ పిల్లలకు రూ. 25వేల బ్యాంక్ డిపాజిట్ పత్రాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన పిల్లలను ఆదుకుంటానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ గంగానరేందర్, మాజీ సర్పంచ్‌లు రాజిరెడ్డి, సిద్ధిరాములు, రాజాసింగ్, రంగారావు, గోపాల్‌రెడ్డి, గణేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న మైనంపల్లి హన్మంతరావు

# 'ఎంఎల్‌హెచ్‌పీ' భర్తీ

మెదక్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో పనిచేసే ఎంఎల్‌హెచ్‌పీ( మిడ్ లెవల్ హెల్త్ ప్రొవిడర్) 10 పోస్టులను భర్తీ చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ చందునాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 పోస్టులను భర్తీ చేయడానికి ఈ నెల 23న మధ్యాహ్నం 3 గంటలకు ఎంబీబీఎస్, ఆయుష్ (బీఏఎంఎస్) వైద్యులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మెదక్ జిల్లాకు చెందిన ఎంబీబీఎస్, ఆయుష్ వైద్యులు సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. ఇంటర్వ్యూలో అర్హతలను పరిశీలించి, నియామక పత్రాలు అందజేస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు.

# దుకాణాలకు వేలం పూర్తి

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 21 : జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న 17 మున్సిపల్ దుకాణాలకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జానకిరామ్‌సాగర్ ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. అత్యధికంగా 9వ నంబర్ దుకాణం (నెలసరి అద్దె) రూ. 55,100లకు గంగాధర్ దక్కించుకోగా, అతి తక్కువగా 5వ నంబర్ దుకాణాన్ని రాజేశ్‌లాల్ రూ.6,800లకు దక్కించుకున్నారు. 17 దుకాణాలకు వేలంపాట నిర్వహిస్తే 58 మంది పాల్గొన్నట్లు కమిషనర్ జానకీరామ్‌సాగర్ తెలిపారు.

# పుస్తెమట్టెలు అందజేత

నిజాంపేట, ఫిబ్రవరి 21 : మండలంలోని వెంకటాపూర్(కే) గ్రామానికి చెందిన చింతల లక్ష్మి, బీరయ్య దంపతుల కూతురు వివాహానికి మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు చేయూతనిచ్చారు. కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, రాజేశం, భాస్కర్‌గౌడ్, శేఖర్ తదితరులు బుధవారం ఎమ్మెల్యే అందజేసిన, పుస్తెమట్టెలను వధువు కుటుంబీకులకు అందజేశారు.

# ఆర్చరీలో ప్రతిభ చాటాలి

రామాయంపేట, ఫిబ్రవరి 21 : ఆర్చరీ క్రీడలో విద్యార్థులు ప్రతిభ చాటాలని ఎస్సై రంజిత్ సూచించారు. మంగళవారం రాత్రి రామాయంపేటలోని ప్రభుత్వ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న విలువిద్య శిక్షణ శిబిరాన్ని ఎస్సై రంజిత్ సందర్శించారు. విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్న శిక్షకుడు బొంతల సత్యనారాయణను ఎస్సై రంజిత్ అభినందించారు.

# గడ్డివాము దగ్ధం.. రెండు పాడి గేదెలు మృతి

చిలిపిచెడ్, ఫిబ్రవరి 21 : అనుమానాస్పద స్థితిలో గడ్డివాము, బర్రెల షెడ్ దగ్ధమైన ఘటన చిలిపిచెడ్ మండలం ఫైజాబాద్‌లో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఫైజాబాద్‌లో టేకుల నర్సింహ్మారెడ్డి చెందిన బర్రెల షెడ్‌తోపాటు గడ్డివామును మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఈ ప్రమాదంలో గడ్డివాము పూర్తిగా కాలిపోయింది. బర్రెల షెడ్‌కు మంటలు అంటుకోవడంతో రెండు పాడి గేదెలు మృతి చెందగా, మరో రెండు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సాయంలో మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయేసరికి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. కాగా, గడ్డివాముకు మంటలు అంటుకున్న ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన పలువురి రైతుల గడ్డివాములు కూడా కాలిపోయాయి. మినుపురి పోచయ్యకు చెందిన 200 గడ్డి మోపులు (రూ. 20వేల ఆస్తినష్టం), వంజరి మొగులయ్య 60 గడ్డి మోపులు(రూ.10వేల ఆస్తినష్టం) అగ్నికి ఆహుతి అయ్యాయి. ఆర్థికంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

# వ్యక్తి అదృశ్యం



అంజయ్య(ఫైల్)

టేక్మాల్, ఫిబ్రవరి 21 : మండల పరిధిలోని కోరంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమైన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఏఎస్సై తుక్కయ్య తెలిపిన వివరాలు.. కోరంపల్లికి చెందిన కొండ అంజ య్య(55) మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంట్లో చెప్పకుండా అంజయ్య బయటకు వెళ్లి పోయా డు. బుధవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తుక్కయ్య తెలిపారు. అంజయ్య ఇంటి నుంచి వెళ్లిన సమయంలో తెలుపు రంగు దోతి, తెలుపు రంగు చొక్కా ధరించాడని, ఎత్తు 5.8 అడుగులు ఉంటాడని, వివరాలు తెలిస్తే దగ్గరిలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ హైదరాబాద్‌లో అర్జెంటుగా కొండాపూర్‌కి సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం, భోజనం, వసతి కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-313897-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.